# ప్లీజ్ బిలీవ్ వినా !

తిరుమలశ్రీ

మేఘ మాలికలను చూసిన నెమలిలా వినోద్ మనసు పురి విప్పుకుని ఆడుతోంది. పేపరులో పరీక్షా ఫలితాలు చూసినప్పటినుండీ ఎప్పుడెప్పుడు ఇంటి వద్ద వాలదామా అని మనసు వేగిర పడుతోంది. తాను ఐ.ఏ.ఎస్. పాసయ్యాడు. ఆ శుభవార్తను మమ్మీకి చెప్పాలి. తనకున్న చెడ్డపేరు ఈ నాటితోనైనా చెరిపి వేసుకో గలిగితే....ఇంతటితో డాడీ మనసులోని అనుమానాలూ, అపోహలూ చెదిరి పోవాలి....

డాడీ గుర్తుకొచ్చేసరికి అదోలా అయిపోయాడు వినోద్. అంతవరకు ఉన్న ఉత్సాహం ఆవిరయిపోయింది. గతం ఒక్కసారి కళ్ళముందు తళుక్కుమంది.

* * *

ఒక్కడే సంతానం కావడంతో మమ్మీ ఎంతో గారాబం చేసేది తనను. అతి గారాబం తనను పాడు చేస్తోందని గ్రహించిన డాడి డిగ్రీ చదువు నిమిత్తం బాబాయి వూరికి పంపేసారు తనను—బాబాయి అంటే తనకు భయంగాఉండేది. మొదటి సంవత్సరం చాలా శ్రద్ధగా చదువుకున్నాడు. రెండవ సంవత్సరంలోనే అయింది తనకు లతతో పరిచయం. ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమించాడు తాను. ఒక్కరోజు ఆమెను చూడకుంటే పిచ్చెక్కేది. చదువు పూర్తి కాగానే పెళ్ళి చేసుకోవాలనుకున్నారు తాము....

కాని—ఎలా జరిగిందో, ఏం జరిగిందో. హఠాత్తుగా లతలో మార్పు వచ్చింది. కారణం తనకు అనూహ్యం. మరొకడితో ప్రణయం ఆరంభించింది. అదేమిటని అడిగితే నిర్లక్ష్యంగా నవ్వి వెళ్ళిపోయింది. అంతే! ఆ తరువాత తామిద్దరూ మళ్ళీ కలుసుకోలేదు....లత! తన ప్రాణంలో ప్రాణంగా ఎంచుకున్న యువతి. జీవితంలో ప్రప్రథమంగా తనకు ప్రేమకు నిర్వచనాన్ని తెలియజేసిన వ్యక్తి. అకారణంగా తన మనసులో అగ్ని గుండాలను రగిల్చి తన జీవితంలో నుండి అకస్మాత్తుగా నిష్క్రమించింది. ఆ ఘాతాన్ని తట్టుకోలేక పోయాడు తాను. స్త్రీ జాతిపైనే రోత కలిగింది. ఆ బాధను భరించడానికి త్రాగుడు అలవాటు చేసుకున్నాడు. సిగరెట్లు కాల్చడం కూడా అలవడింది. అవి చాలవన్నట్లు హీరోయిన్, హాషిష్ వంటి మత్తు పదార్థాలకు సయితం అలవాటు పడ్డాడు.

బాబాయి తన సంగతి తెలుసుకునేసరికి ఆలస్యమయి పోయింది. అప్పటికే కుత్తుక వరకూ బురదలో కూరుకు పోయాడు. తాను నార్కొటిక్స్ హాబిట్‌కు పూర్తిగా బానిస అయిపోయాడు. అది లేనిదే నిద్ర పట్టేదికాదు. పిచ్చెక్కిపోయేది.

దానిని సంపాదించడం కొరకు యేం చేయడానికైనా వెను దీయని స్థితిలో వున్నాడు. హీరోయిన్ సేవించినంతసేపూ ఏవో స్వర్గ సీమలలో, దేవలోకాలలో తేలిపోతూ ఉండేవాడు మత్తు వదిలే సరికి లత గుర్తుకొచ్చేది. ఆమె చేసిన వంచన గుండెలు పిండేది. అది మరిచిపోవాలని మళ్ళా త్రాగేవాడు. వాటి ప్రభావం తగ్గిపోగానే ఎక్కడలేని నీరసమూ, నిస్సత్తువా ఆవరించేవి. దీర్ఘ రోగిలా తయారయాడు. క్రమంగా ఫిజికల్‌గానూ, మెంటల్‌గానూ క్రుంగిపోసాగాడు. అప్పటికే తనపరిస్థితి చేయి దాటిపోయినట్లు గ్రహించిన బాబాయి భయపడ్డాడు. నమ్మి కొడుకు బాధ్యతను అప్పగించినందుకు ద్రోహాన్ని చేశాడని అన్నయ్య ఏమంటాడోనన్న భయం పట్టుకుంది అతనికి.

విషయం తెలుసుకున్న డాడీ పరుగెత్తుకొచ్చారు. తమ్ముణ్ని చెడామడా తిట్టారు. వెంటనే తన చదువుకు వుద్వాసన చెప్పించి తీసుకుపోయారు. ఆయన బాధ్యతాయుతమైన ఒక పోలీస్ ఆఫీసర్. కొడుకును తన కంటె ఘనుణ్ని చేయాలన్న ఆశ, ఆశయము ఆయనలో వుండడం తప్పుకాదు. కాని, తానేం చేశాడు? కన్నవారి ఆశలను, ఆశయాలను భస్మం చేసి, ఆ భస్మాన్ని హుక్కా పీల్చేశాడు.

సహజ గంభీరుడైన డాడీ తనపట్ల మరింత కఠినంగా తయారయ్యారు. ఈటెలవంటి మాటలతో తన హృదయాన్ని తూట్లు పొడిచారు. తనపైన ప్రేమ, అనురాగము, అభిమానము, జాలికి బదులు - అసహ్యమూ, ఆగ్రహము, నిర్లక్ష్యము ఏర్పడ్డాయి. ఆయనలో. తాను ఎదురు పడితేనే పాపం అన్నట్లు ప్రవర్తించేవారు. ఆయన చూపులలో ప్రతిఫలించే ఛీత్కారము, అసహ్యము భరించలేక పోయేవాడు తాను. అయినా తన బోధను అర్థం చేసుకోరేం! తన పరిస్థితిని సానుభూతితో గుర్తించడానికి ప్రయత్నించరేం! తండ్రికీ, కొడుక్కీ మధ్య జెనరేషన్ గ్యాప్ అంత అగాధమైనదా?

మమ్మీ కావలించుకుని ఏడ్చింది. మళ్ళా ఆ దురలవాట్ల జోలికి పోనని తన చేత ఎన్నో ఒట్లు వేయించింది. ఆ ఒట్లను అతిక్రమించిన క్షణంలో తాను ప్రాణ త్యాగం చేసుకొంటానని బెదిరించింది.

చెడుఅలవాట్లు చేసుకున్నంత సులభం కాదు, విడిచిపెట్టడం! అయినా, మమ్మీ కోసం- ఆనెస్ట్ అటెంప్ట్ చేసాడు తాను మారడానికి. డాక్టర్ కృషికి తన పట్టుదల తోడుకాగా, కొన్నాళ్ళకు మళ్ళీ మామూలు మనిషయ్యాడు. కాని—డాడీకి తనకు మధ్య అగాధం మాత్రం అలాగే ఉండిపోయింది. ఆయన పోలీసు ఆఫీసరు. వృత్తిరీత్యా అలవడినదికావచ్చు- ఎప్పుడూ ఎదుటివారిని అనుమానంగా చూడడం ఆయన స్వభావం. తన్నొక దొంగలా, దోషిలా చూసేవారు. తమ మధ్య మాటా మంతీ కరువయ్యాయి. ఒకవేళ ఎన్నడైనా నోరు విప్పితే అది తన గతాన్ని ఎత్తిదెప్పడానికి, తన మనసును శూలాలతో పొడవడానికేఅయ్యేది. ఆ విధంగా తమ మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది. బహుశా తల్లులకంటె

తండ్రులు తమ సంతానంయొక్క అపరాధాలను అంత తేలికగా క్షమించలేరేమో!

తనలో వస్తూన్న పరివర్తనను గమనించి మమ్మీ ఎంతో సంతోషించేది. డాడీ ప్రవర్తన ఆవిడనూ మానసికంగా క్రుంగదీస్తోందని తా నెరుగును. కాని. ఆవిడ అశక్తురాలు— తనకు తెలిసి ఏనాడూ మంచికికాని, చెడుకుకాని డాడీకి ఎదురుచెప్పి ఎరుగదావిడ.

డాడీని పలుకరించాలనీ, తాను మళ్ళా మనిషయ్యానని ఆయనతో చెప్పుకోవాలనీ మనసెంతో తహతహలాడేది. కాని ఆయన గంభీరవదనం, కఠినదృక్కులు తిలకించేసరికి తన ధైర్యం అడుగంటిపోయేది. దోషిలా తలవంచుకుని తప్పుకుని తిరిగేవాడు.

ప్రైవేట్‌గాకట్టి ఫస్టుమార్కులతో కాకపోయినా, మంచి మార్కులతో పట్టా తీసుకున్నాడు తాను. అప్పటికీ డాడీలో మార్పులేదు. ఆయన వదనంలో ప్రసన్నత, చూపులలో అభినందనల కొరకు ఎదురుచూసిన తనకు ఆశాభంగమే అయింది. తనమీద ఆయనకింకా అనుమానమేనన్న సంగతి గ్రహించడంతో మరింత క్రుంగిపోయాడు తాను. ఇక జన్మలో ఆయన తనను విశ్వసించడని ఊహించడంతో పూర్తిగా నిరాశ చేసుకొన్నాడు. అప్పటినుండీ నిర్లిప్తతను పెంపొందించుకొన్నాడు.

అటు భర్తకు చెప్పలేక, ఇటు తనయుడి బాధను చూడలేక సతమతమయ్యే మమ్మీని చూస్తే జాలివేసేది.

ఏదో ఒక వ్యాపకం లేకుంటే తనకు పిచ్చెక్కేటట్లుంది. ఆ మధ్య మళ్ళీ లత జ్ఞాపకాలు తనను వెన్నాడ నారంభించాయి. అందుకే మనసును మరల్చుకునేందుకు ఐ.ఎ.ఎస్.కు చదివాడు. తాను చదువుతున్నట్లు తల్లికి సయితం చెప్పలేదు. ఒక స్నేహితుడితో కలిసి కష్టపడి చదివాడు. చదువు నిమిత్తం ఎక్కువకాలం స్నేహితుడి ఇంట్లోనే గడుపుతూ వుండడం డాడీకి మరింత అనుమానాస్పదంగా వున్నదని తానెరుగును. అయినా లక్ష్యపెట్టలేదు. నిజం తెలిసిన రోజున ఆయన తనపొరపాటును గ్రహించక పోరు. ఎలాగైనా ఐ.ఎ.ఎస్. పాసవ్వాలి. తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవాలి అన్న పట్టుదల.... శ్రద్ధగా చదివాడు. పడిన కష్టానికి ప్రతిఫలం లభించింది. ఐ.ఎ.ఎస్. మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు తాను.

ఆ సంతోషకరమైన వార్తను మమ్మీ చెవినివెయ్యాలి ముందు. డాడీకి తానేమీ తీసిపోలేదని ఎలుగెత్తి చాటాలి. తప్పులు చేయడం మానవ నైజం. కాని. వాటిని తెలుసుకుని సరిదిద్దుకోవడంలోనే వున్నది ఔన్నత్యం. కారణాంతరాలవల్ల తప్పటడుగు వేసిన వ్యక్తి— దానిని వెనుకకు తీసుకోకూడదని ఎక్కడాలేదు. మనిషి పొరపాటు చేయడం ఎంత సహజమో, దానిని గ్రహించి సరిదిద్దుకోవడమూ అంతే సహజం. ఒకసారి పతనమయిన వ్యక్తి ఇక మారడు, మారలేడు అనుకోవడం పొరపాటు.... అని డాడీకి నిరూపించబోతున్నాడు తానీరోజు. ఆయన రియాక్షన్ ఎలా వుంటుందో చూడాలి.

వినోద్ ఇంటికి చేరుకునేసరికి తల్లి. తండ్రీ ఇంట్లోలేరు. ఎక్కడికోవెళ్ళారు. పొంగే పాలపైన నీళ్ళు చల్లినట్లయింది. నిరుత్సాహంగా చేతిలోని పేపరు ప్రక్కను పడేసి సోఫాలో కూల బడ్డాడు.

అంతలోనే వూళ్ళోనే వుంటున్న వినోద్ మేనమామ శంకర్ వచ్చాడు. "కంగ్రాచ్యులేషన్స్‌రా. వినోద్" అంటూ.

వినోద్ ఆశ్చర్యంగా చూసాడు.

"నాకెలా తెలిసిందా అని ఆశ్చర్య పోకు. నువ్వు దాచినా- నీ ఫ్రెండ్ త్రోవలో కనిపించి చెప్పాడు లే" అన్నాడు శంకర్. "పట్టుదల అంటే నీదేనోయ్ అల్లుడూ! కాబోయే కలెక్ట రువి. ఈ మామను మర్చిపోకేం!"

వినోద్‌కు సంతోషంగా వుంది. కాని, ఆ సంతోషాన్ని పంచుకోవలసిన వాళ్ళు అక్కడలేరు. అన్న ఆలోచన తేలు కొండ్లిలా అతని హృదయంలో గుచ్చు కుంది.

## 2

ఏదో పార్టీకి వెళ్ళి రాత్రి ఆల స్యంగా ఇంటికి తిరిగి వచ్చిన వినోద్ తల్లిదండ్రులు- సోఫాలో మునగతీసుకుని పడుకున్న కొడుకును చూసారు. ఎదు రుగా టీపాయ్‌మీద ఖాళీ అయిన బ్రాందీ బాటిలూ, ఖాళీగ్లాసూ, యాష్ ట్రేలో సిగ రెట్‌పీకలూ కనిపించాయి.

వినోద్ తండ్రి దినకర్ క్రోధావేశా లతో పళ్ళు పటపట కొరికాడు. "కుక్క తోక ఎంత సవరిస్తేమాత్రం వంకర పోతుందా? ఈ భ్రష్టుడి బ్రతుకూ అంతే!" అన్నాడాయన. ఆయన గొంతులో అసహ్యం, ఈసడింపు చోటు చేసుకున్నాయి.

తల్లి శ్యామలమ్మ విలవిలలాడి పోయింది. వినోద్.... మారాడనుకున్న తన వినోద్- మళ్ళీ వ్యసనాలకు బానిస అయ్యాడా! చపలచిత్తుడై తన కిచ్చిన వాగ్దానాలను విస్మరించాడా!" ఆమె హృదయం ఆక్రోశించింది.

ప్రత్యక్షంగా కనిపిస్తూన్న సాక్ష్యా ధారాలు, 'అబద్ధం!'అంటూన్న మనసును నోరు నొక్కేసాయి.

దినకర్ మేఘ గర్జనకు త్రుళ్ళిపడి కళ్ళు రెండూ తెరిచాడు వినోద్.

"భ్రష్టుడా! నీలో మార్పు వచ్చిందని మీ అమ్మ మొత్తుకుంటూంటే నిజమేనను కున్నాను. కాని, నీ వంకరబుద్ధి ఎక్కడికి పోతుంది! ఎలా మారుతుంది! వేళాపాళా లేకుండా వూరిమీదపడి తిరుగుతూంటే చూడనట్లు వూరుకున్నాను. చివరకు ఇంటిలోనే త్రాగడం వరకు వచ్చావన్న మాట!"

ఉలిక్కిపడి కంగారుగా టీపాయ్ వైపు చూసాడు వినోద్.

"డాడీ!" అన్నాడు నిర్ఘాంతపోతూ.

"షటప్! యూ డర్టీ ఫెలో...." దిన కర్ వుద్రేకపూరితుడయ్యాడు.

"డాడీ! ప్లీజ్ లిసన్ టు మీ...."

"నోర్ముయ్! నీవంటి అప్రాచ్యుడు నా కొడుకని చెప్పుకోవడం సిగ్గుచేటు. తక్షణం ఇక్కడినుండి వెళ్ళిపో. ఇక ఎన్నడూ నీ ముఖం నాకు చూపించకు."

"డాడీ!...." నోరు పెగల్లేదు

వినోద్‌కు.

"ఏమండీ!" అలజడి చెందింది శ్యామలమ్మ.

"డాడీ!" నన్నర్థం చేసుకోండి. నేను నేను...." కన్నీరు గొంతుక్కు అడ్డు పడింది వినోద్‌కు.

"మాట్లాడడానికి సిగ్గులేదూ?.... వెళ్ళు నువ్వు నాకసలు పుట్టనే లేదనుకుంటాను. గెటౌట్."

"ఏమండీ!"

"మమ్మీ!" ఆరాటపడ్డాడు వినోద్. "మమ్మీ! నువ్వయినా నన్నునమ్మవూ?"

"వినోద్! డాడీకి క్షమాపణ చెప్పుకో ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చెయ్యనని చెప్పు." అని శ్యామలమ్మ అనడంతో, నిర్ఘాంతపోయాడు వినోద్.

"మమ్మీ! నేను తప్పేమీ చేయలేదు మమ్మీ!"

నీతో మాటలు అనవసరం. పో. ఇక్కడినుండి" అంటూ గర్జించాడు దినకర్.

సూటిగా తండ్రి ముఖంలోకి చూచాడు వినోద్.

"డాడీ! గతంలో నేను తప్పులు చేసి వుండవచ్చును. ఇప్పుడు నేను మారాను. అయినా, నాలోని మార్పును గుర్తించరు మీరు. నన్ను ఏనాడూనమ్మలేదు మీరు. నేను జీవించి వున్నంతవరకుమీకునాపైన నమ్మకం కలగదని నాకు తెలుసు — వెడతాను డాడీ! వెళ్ళేముందు ఒక్కమాట! ఒక పెద్ద పోలీస్ ఆఫీసర్ మీరు. మనిషిని మనిషిగా గుర్తించలేక పోవడం బహుశా వృత్తిరీత్యామీకలవడిన బలహీనత ఏమో! దొంగ ఎల్లప్పుడు దొంగగానే వుండనవసరంలేదు డాడీ! తగిన అవకాశం లభిస్తే దొరగా మారవచ్చు. వెళుతున్నాను డాడీ!"

దినకర్ పళ్ళు కొరుకుతూ మౌనంగా వుండిపోయాడు.

"మమ్మీ! నా మూలంగా నువ్వెంతో మనోక్షోభను అనుభవించావు — వెళ్ళిపోతున్నాను మమ్మీ! క్షమిస్తావుకదూ?"

"వినోద్!" అంటూ చేయిపట్టుకుంది శ్యామలమ్మ దుఃఖంతో.

"మమ్మీ? కనీసం నువ్వయినా నన్నర్థం చేసుకుంటావని ఆశించాను— వుహు—, నాన్నగారిని కాదనే శక్తి నీకెక్కడిది! అది నాదురదృష్టం.... నన్ను వెళ్ళనీ!"

గుండె బండ చేసుకున్న వినోద్ తల్లి చేయి విడిపించుకొని, తలవంచుకుని వడివడిగా అడుగులు వేసుకొంటూ ఆ చీకటిలో బయటకు వెళ్ళిపోయాడు.

"ఏమండీ! వినోద్ వెళ్ళిపోతున్నాడండీ.... పిలవండీ నా కోసమైనా నా బాబును రమ్మని పిలవండీ!" అంటూ భర్తను పట్టుకొని ఆక్రోశించింది శ్యామలమ్మ.

మెదడు మొద్దుబారిపోగా, ప్రాణం లేని రాటలా నిలుచుండి పోయాడు దినకర్.

## 3

ఆ దంపతులలా ఎంతసేపు వుండిపోయారో తెలియదు.

"హలో, సిస్టర్! ఏమిటలా నిలుచునే కలలు కంటున్నారిద్దరూ?" అంటూ

శంకర్ వచ్చాడు.

తమ్ముడి రాకతో తేరుకుంది శ్యామలమ్మ.

"కూర్చోవోయ్" అంటూ సోఫాలో చతికిలబడ్డాడు దినకర్.

"ఏమందోయ్, బావగారూ! పార్టీ ఘనంగా చేయకపోతే వూరుకునేదిలేదు, ఆఁ...." అన్నాడు శంకర్ బావగారి ప్రక్కనే కూర్చుంటూ.

నొసలు చిట్లించాడు దినకర్. "ఏమిటి సంగతి, పార్టీ గీర్టీ అంటున్నావ్?"

"త్వరలోనే కలెక్టర్‌గారికి తండ్రి కాబోతున్నారు మీరు....అప్పుడే ఆవార్త నావరకూ ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోతున్నారా?"

భోళాశంకర్ ఏమంటున్నాడో అర్థం కాక అయోమయంగా చూసారు దంపతులు.

"శంకర్! అసలే మా మనసులు బావుండలేదు. నీ వేళాకోళాలు కాసేపు కట్టిపెడుదూ" అంది శ్యామలమ్మ.

"పేపరులో పెద్ద పెద్ద అక్షరాలతో వేస్తే వేళాకోళం అంటావేమిటి అక్కయ్యా!"

"పేపరులోనా!? ఇంతకూ నువ్వంటున్నదేమిటి?" అని దినకర్ ప్రశ్నించడంతో.

"అయితే, ఈ విషయం మీకు నిజంగానే తెలియదా? ఏడీ మనహీరో?" అన్నాడు శంకర్ ఆశ్చర్యపోతూ.

"వినోద్ లేడు" అంది శ్యామలమ్మ.

"ఇలా చూడండి, బావగారూ!" అంటూ ప్రక్కనే పడివున్న న్యూస్ పేపర్ తీసి ఐ. ఎ. ఎస్. రిజల్ట్స్‌లో వినోద్ పేరుచూపించాడు శంకర్. వినోద్ స్నేహితునిద్వారా తాను తెలుసుకున్నదంతా వివరించాడు.

అంతావిని దినకర్ తెల్లబోయాడు.

"మా అల్లుణ్ణి కంగ్రాచ్యులేట్ చేసిన మొదటివ్యక్తి నేనే తెలుసా!" అన్నాడు శంకర్ కాలర్ పైకెత్తి.

"అంటే, నువ్వు సాయంత్రం ఇక్కడికివచ్చావా?" ప్రశ్నించిందిశ్యామలమ్మ.

"ఊఁ, మీచేత తక్షణమే సెలబ్రేట్ చేయించాలని రెండుగంటలసేపు వెయిట్ చేసి విసుగెత్తిపోయాననుకో. ఇక మీరెలాగూ వచ్చేట్టులేరని, నేనే సెలబ్రేట్ చేసేసుకున్నాను. బావగారు అతిధుల కోసం బీరువాలో భద్రంగా దాచిపెట్టిన విస్కీ సేవించి, న్యూబ్రాండ్ సిగరెట్స్ స్మోక్‌చేస్తూ...."

శంకర్ మాటలకు మధ్యలోనే అడ్డు తగిలింది శ్యామలమ్మ! "అయితే....ఈ టీపాయ్‌మీదున్న బాటిల్, గ్లాసు ఇవినువ్వు త్రాగినవేనా? యాష్‌ట్రేలోని సిగరెట్ పీకలు నీవేనా?" అంది వణికే స్వరంతో.

"ఔను, ఏం?"

"భగవాన్! ఎంత పని జరిగింది!"

"ఏమి టక్కయ్యా, ఏమయింది?" అయోమయంగా అడిగాడు శంకర్.

"అయితే, వినోద్ త్రాగలేదూ?" అందామె.

"లేదే! కంపెనీ కోసం ఒక పెగ్గ్ వేసుకోమన్నాను కూడాను. వినలేదు."

దినకర్ చేష్టలుడిగి చూస్తూంటే....

"బాబూ!.... వినోద్ —" అంటూ కుప్పకూలిపోయింది శ్యామలమ్మ.